క్లుప్తంగా

అర్ధరాత్రి వేళ.. సీపీ ఆకస్మిక తనిఖీలు

- బయటపడిన పోలీస్ స్టేషన్ల లోపాలు

తాటిచెట్లపాలెం: విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చేపట్టిన అర్ధరాత్రి తనిఖీల్లో పలు పోలీస్ స్టేషన్లలోని లోపాలు బయటపడ్డాయి. వివరాలిలా.. ఆదివారం అర్ధరాత్రి దాటాక ద్వారకా, ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్లను సీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఫోర్త్ టౌన్ పీఎస్‌లో విధులు నిర్వర్తించాల్సిన సెంట్రీ నిద్రపోవడాన్ని గుర్తించారు. ద్వారకా స్టేషన్ నిబంధనలకు విరుద్ధంగా తలుపులు మూసి ఉండటాన్ని గమనించారు. వెంటనే సిబ్బందికి మెమోలివ్వాలని సంబంధిత ఏసీపీలకు కమిషనర్ ఆదేశాలిచ్చినట్లు తెలిసింది.

'సినారె' రచనలు సందేశాత్మకం



సినారె సాహిత్య సమాలోచన సదస్సులో పాల్గొన్న సాహితీవేత్తలు

సీతంపేట: జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతిని పురస్కరించుకుని విశాఖ పౌర గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం పబ్లిక్ లైబ్రరీలో సినారె సాహిత్య సమాలోచన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సి.నారాయణరెడ్డి రచించిన చారిత్రక గేయ కథా కావ్యం కర్పూర వసంత రాయలులోని కథన శిల్పాన్ని శైలీ సౌకుమార్యాన్ని దేశం కోసం వ్యక్తులు త్యాగం చేయాల్సిన అవసరాన్ని సందేశాత్మకంగా వ్యక్తం చేశారని వివరించారు. కొండవీటి కుమారగిరి రెడ్డి కాలంనాటి చారిత్రక గాథను రస రమ్యంగా అక్షరీకరించారన్నారు. రాంభట్ల నృసింహ శర్మ సి.నా.రె. గీతాలు ఆలపించి, వాటి సౌందర్యాన్ని ఆవిష్కరించారు. సాహితీవేత్తలు శేఖర మంత్రి ప్రభాకర్, డాక్టర్ కె.ఎస్.ఎన్.మూర్తి, శివాజీ, రాధారాణి, నిర్మల, ఉప్పల అప్పలరాజు ప్రసంగించారు.

క్రైస్తవులపై దాడులు చేస్తే సహించం



మాట్లాడుతున్న బక్క పరంజ్యోతి

సీతంపేట: దళిత క్రైస్తవులపై దాడులు చేస్తే సహించేది లేదని ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త బక్క పరంజ్యోతి హెచ్చరించారు. దళితుల హక్కుల సాధన కోసం అక్కయ్యపాలెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనుమతులు లేని చర్చిలపై కూటమి ప్రభుత్వం దాడులు చేయిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత క్రైస్తవులపై ఎటువంటి నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. గతంలో ఉన్న కాంగ్రెస్, ఇపుడు బీజేపీ ప్రభుత్వాలు ఎటువంటి సాయం చేయడం లేదని చెప్పారు. దేశంలో మతం మారడం స్వేచ్ఛతో కూడిన హక్కని, దానిని కాలరాస్తామంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. దళిత క్రైస్తవుల హక్కుల సాధనకు వివిధ రూపాల్లో పోరాడుతామని తెలిపారు.

ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు వినతి



జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ కోరారు. ఈమేరకు సోమవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు ఆయన వినతిపత్రం అందజేసి, సమస్యను వివరించారు. ప్రస్తుతం ఉన్న యూపీహెచ్‌సీ ఇరుగ్గా ఉందని పలుమార్లు వినతిపత్రాలు అందజేశామన్నారు. ఈ విషయమై ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును కూడా అడిగానన్నారు. ఆయన స్పందించి స్థలం పరిశీలించాలని అధికారులను ఆదేశించినట్టు కార్పొరేటర్ తెలిపారు. వార్డులో సుమారు 46 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉందని, దానిని పరిశీలించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఎనిమిది పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయడం వల్ల వార్డు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని రెయ్యి వెంకటరమణ అన్నారు.



మహారాణి పార్లర్ జంక్షన్ వద్ద తవ్వి వదిలేసిన మట్టి




శ్రీనివాసనగర్‌లో ఇళ్ల ముందు తవ్వి వదిలేసిన మట్టి కుప్పలు



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో మెడికల్ షాపుల ముందు మట్టి కుప్ప

పర్యవేక్షణ లోపం.. ప్రజలకు శాపం

- 26, 43, 44 వార్డుల్లో అస్తవ్యస్తంగా అమృత్ 2.0 పనులు
- 24/7 తాగునీటి సరఫరా కోసం పైప్‌లైన్ల ఏర్పాటు
- ప్రధాన రహదారులను తవ్వేయడంతో రాకపోకలకు ఇబ్బందులు
- తవ్విన మట్టిని షాపులు, ఇళ్ల ముందు కుప్పలుగా పడేస్తున్న వైనం
- వ్యాపారులు, స్థానికుల గగ్గోలు



పాలబూత్ సెంటర్‌లో దుకాణాల ముందు అడ్డంగా పడేసిన ఐరన్ స్తంభం

సీతంపేట: అధికారుల పర్యవేక్షణ లోపంతో చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు శాపంగా మారాయి. జీవీఎంసీ 43, 44, 26 వార్డుల్లో జరుగుతున్న అమృత్ 2.0 ఇంటింటికీ 24/7 తాగునీటి సరఫరా పనులు స్థానికులను అవస్థల పాలు చేస్తున్నాయి. ఈ వార్డుల్లోని అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, ఎన్‌జీజీవోస్ కాలనీ, 80 ఫీట్ రోడ్, శ్రీనివాస నగర్, నందగిరినగర్, వెంకటేశ్వర కాలనీ, యలమంచిలి వారి వీధి, గోళీలపాలెం, నరేంద్రనగర్ ప్రాంతాల్లో నీటి సరఫరా కోసం రహదారులను తవ్వి పైపులు వేశారు. మరికొన్ని చోట్ల ఈ పనులు రెండు నెలలుగా జరుగుతున్నాయి. తవ్విన మట్టిని పెద్ద కుప్పలుగా రోడ్లపై వదిలేశారు. ఇళ్లు, దుకాణాల ముందు మట్టి కుప్పలు అడ్డంగా ఉండటంతో రాకపోకలకు జనం ఇబ్బంది పడుతున్నారు. గోతులను కాంక్రీట్‌తో పూడ్చక పోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారులన్నీ బురదతో చిత్తడిగా మారాయి. ఇళ్లు, వ్యాపార దుకాణాల ముందు బురద, మట్టి, నీరు నిలిచిపోయింది. రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో పాదచారులు, వాహన చోదకులు జారిపడే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలకు అవస్థలు..

అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, 80 ఫీట్ రోడ్, మహారాణి పార్లర్ కూడలి, శ్రీనివాసనగర్‌కు వెళ్లే అర్బి మార్గాల్లో ప్రధాన పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ పెద్ద పెద్ద పైపులు వేస్తుండటంతో చాలా లోతు వరకు గోతులు తవ్వారు. ఆ మట్టిని రోడ్డుపై కుప్పలుగా వేయడంతో సగానికి పైగా ఆక్రమించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఫలితంగా నెల రోజులుగా ఆయా ప్రాంతాల వాసులు అవస్థలకు గురవుతున్నారు.

వ్యాపారులకు ఇబ్బందులు..

అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, 80 ఫీట్ రోడ్, మహారాణి పార్లర్ కూడలి, శ్రీనివాసనగర్ ప్రధాన రహదారుల్లో తవ్విన మట్టి దుకాణాల ముందు కుప్పలుగా వదిలేశారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ పాలబూత్ సెంటర్‌లో కనకమహాలక్ష్మి బ్యాంకు వద్ద తొలగించిన జియో కంపెనీ ఐరన్ పోల్ పక్కనే ఉన్న హార్డ్‌వేర్, బుక్‌షాప్‌ల ముందు అడ్డంగా పడేశారు. అదే ప్రాంతంలో బేకరీ, మెడికల్ షాపుల ముందు కూడా మట్టి కుప్పలుగా వేసి వదిలేశారు. దీంతో ఆయా షాపులకు వినియోగదారులు వచ్చే మార్గం లేక నష్టపోతున్నామని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.

గతం ప్రభుత్వంలో రూ.12 కోట్లతో అభివృద్ధి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.12 కోట్లతో అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ విస్తరణ, మహారాణి పార్లర్ కూడలి బ్యూటిఫికేషన్‌తో అందగా తీర్చిదిద్దారు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ రహదారులను అమృత్ పేరిట ఇష్టానుసారంగా తవ్వేయడంతో స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మళ్లీ పూర్వ స్థితిలో రహదారులను చూస్తామా అని సందేహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలని ఆయా కాలనీల వాసులు, వ్యాపారులు కోరుతున్నారు.

షాపులకు అడ్డంగా ఐరన్ పోల్



అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లో వేల రూపాయలు అద్దె కట్టి హార్డ్‌వేర్ షాప్ నిర్వహిస్తున్నాను. అమృత్ పనుల్లో భాగంగా ఇక్కడున్న జియో కంపెనీకి చెందిన ఐరన్ పోల్‌ను తొలగించి మా షాపు ముందు అడ్డంగా పడేశారు. దీనివల్ల వినియోగదారులు షాపు వద్దకు రాకపోవడంతో బేరాలు లేక నష్టపోతున్నాను. అమృత్ పనులు చేస్తున్న వారిని అడిగితే.. ఆ పోల్ జియో కంపెనీదని, వారే తొలగించాలని అంటున్నారు.

– పి.ప్రసాద్, వ్యాపారి, పాలబూత్ సెంటర్

ఇబ్బందులు లేకుండా చూడాలి



వార్డుల్లో నెల రోజులుగా అమృత్ పనులు జరుగుతున్నాయి. రోడ్లు తవ్వి మట్టి కుప్పలుగా వేస్తున్నారు. మహారాణి పార్లర్ కూడలి, శ్రీనివాస వీధికి వెళ్లే మార్గంలో చాలా ఇబ్బంది కలుగుతోంది. ప్రధాన రహదారుల్లో నీటి సరఫరా పైపులు వేస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుంది.

– రాజగిరి సింహాచలం, అక్కయ్యపాలెం

300వ రోజుకు పోర్టు ఆస్పత్రి పరిరక్షణ దీక్షలు



పోర్టు హాస్పిటల్ వద్ద నిరసన దీక్ష చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను ఆపాలని కైలాసపురం పోర్టు ఆస్పత్రి వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరసన దీక్షలు 300వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సోమవారం మానవ హారం నిర్వహించారు. అనంతరం సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు పద్మనాభరాజు మాట్లాడుతూ ఈ పోరాటం వల్ల గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ టెండర్‌కు ఎవరూ రాలేదని, ఆస్పత్రి అభివృద్ధి కోసం చైర్మన్ కమిటీ వేశారన్నారు. పోర్టు హాస్పిటల్‌ను పోర్టు సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని, ఈ విషయంపై కూటమి ప్రభుత్వం స్పందించాలని కోరారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం అనర్థమన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో కార్మికులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని ఆయన హెచ్చరించారు. దీక్షకు బీహెచ్‌ఈఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.టి.ప్రకాష్, డాక్‌యార్డ్ యూనియన్ నాయకుడు గణేష్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, గణేష్, శంకరరావు, నర్సింగరావు, త్రినాథరావు, ఈశ్వరరావు, రాఘవులు, బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో క్రికెట్ పోటీలు



టాస్ వేస్తున్న ఎస్ఎంసీ సభ్యులు

సీతంపేట: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. స్కూల్ హెచ్ఎం జయంతి రాధాకుమారి పోటీలను ప్రారంభించారు. ఎస్ఎంసీ సభ్యులు టాస్ వేశారు. పీడీ రత్నం, ఎస్ఎంసీ చైర్మన్ వంగల అప్పలరాజు, సభ్యులు అప్పలనాయుడు, రాణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

తైక్వాండోలో విశాఖ క్రీడాకారుల సత్తా

- 12 బంగారు, 8 రజత పతకాలతో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం



తైక్వాండో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న విశాఖ క్రీడాకారులు

మురళీనగర్: తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖ క్రీడాకారులు సత్తా చాటారు. యలమంచిలిలో అనకాపల్లి యూత్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న జిల్లా స్థాయిలో 5వ సబ్ జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్–2025 నిర్వహించారు. 108 మంది తైక్వాండో క్రీడాకారులు పోటీపడ్డారు. విశాఖ నుంచి మురళీనగర్, నౌసేనా భాగ్, కోస్ట్ గార్డ్ బ్రాంచిల నుంచి 20 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మురళీనగర్ నుంచి 20 మంది పాల్గొనగా.. వీరిలో 11 మంది బాలురు, 9 మంది బాలికలు ఉన్నారు. మొత్తంగా 20 పతకాలు సాధించారు. వీటిలో 12 బంగారు, 8 రజతం, ఒక కాంస్య పతకం ఉన్నాయి. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను విశాఖ క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. వీటితోపాటు కొరిగి విభాగంలో ఒక కాంస్యం, వ్యక్తిగత పూమ్సేలో బంగారు పతకం సాధించారు. కోస్ట్‌గార్డ్ బ్రాంచి నుంచి 12 మంది, మురళీనగర్ నుంచి నలుగురు, నౌసేనాబాగ్ బ్రాంచి నుంచి నలుగురు పతకాలు సాధించినట్లు మురళీనగర్ కోచ్ మిధిలేష్ పల్లం తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విజేతలను పలువురు అభినందించారు.

మహిళా వాకర్స్ సేవలు ప్రశంసనీయం



సురేఖ పట్నాయక్‌కు విద్యా సామగ్రిని అందిస్తున్న ప్రభావతి, మహిళా వాకర్స్

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పి.ప్రభావతి అన్నారు. క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి ఆధ్వర్యంలో సోమవారం వాకర్స్ క్లబ్‌లో గిరిజన ప్రాంత పాఠశాలల విద్యార్థులకు అధ్యయన సామగ్రి వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు, మహిళా చైతన్య కార్యక్రమాల నిర్వహణ ద్వారా క్లబ్ సభ్యులు గుర్తింపు పొందారన్నారు. అనంతరం మాడుగుల మండలంలోని కొత్తపాలెం తదితర గిరిజన ప్రాంత పాఠశాలల పేద విద్యార్థులకు అందజేయాలని నోట్ పుస్తకాలు, స్టేషనరీ, ఇతర సామగ్రిని ట్రైబల్ సొసైటీ వ్యవస్థాపకురాలు యు.సురేఖ పట్నాయక్‌కు ప్రభావతి, వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె.ద్వారకానాథ్‌ల చేతుల మీదుగా అందించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం, రీజినల్ కౌన్సిలర్–5 ఉప్పలపాటి శుభ, ఎలెక్ట్ గవర్నర్ మహేష్ మహిళా వాకర్స్ సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి, కార్యదర్శి పి.కమల, ఎడిటర్ డి.శిరీష, బోర్డ్ డైరెక్టర్ ఎ.రాధ, వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భానుప్రకాష్, సిహెచ్.ప్రసాద్, సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రకాష్ పాల్గొన్నారు.

కళాత్మకంగా..

- మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో చురుగ్గా అభివృద్ధి పనులు



పార్కులో సిద్ధంగా జిమ్ పరికరాలు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడ అదనపు సౌకర్యాల కల్పనకు జీవీఎంసీ నిధులు రూ.18 లక్షలతో పనులు నిర్వహిస్తున్నారు. పాత బోరులో నీరు అడుగంటిపోవడంతో కొత్త బోరు 250 అడుగుల లోతు వరకు వేశారు. దీనికి 5స్టార్ రేటింగ్ 1హెచ్‌పీ మోటారు బిగించారు. కొత్తగా జిమ్ పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. పిల్లల కోసం రోలర్ స్లైడ్, రైడర్స్, రెండు సీట్లు కలిగిన ఊయల ఏర్పాటు చేస్తారు. జిమ్ హ్యాండ్ రోవర్, స్కైవాకర్ షోల్డర్ ప్రెస్, చెస్ట్ ప్రెస్ వంటి పరికరాలను గతంలో సైకిల్ పార్కింగ్ షెడ్‌లో ఏర్పాటు చేశారు. ఇందుకు అవసరమైన జిమ్ పరికరాలు సిద్ధం చేశారు. వీటిని త్వరలో అమరుస్తారు. జిమ్ ఫ్లోర్‌ను చెకర్డ్ టైల్స్‌తో నిర్మిస్తారు. ప్రహరీ గోడ బయటివైపు మ్యూరల్ ఆర్ట్ పెయింటింగ్, లోపలి వైపు పెయింటింగ్, స్కేటింగ్ రింక్ పెయింటింగ్ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రహరీ గోడపై మ్యూరల్ ఆర్ట్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండు మూడు రోజుల్లో పెయింటింగ్ పనులు పూర్తవుతాయని పార్కు నిర్వాహకులు తెలిపారు.



మ్యూరల్ ఆర్ట్‌తో ఆకర్షణీయంగా వైశాఖి స్పోర్ట్స్ పార్క్ ప్రహరీ

హామీలు నెరవేర్చని 'కూటమి'ని నిలదీద్దాం



14వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు



48వ వార్డులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కరపత్రం ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు, పార్టీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు పిలుపు
- 14, 48 వార్డుల్లో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

తాటిచెట్లపాలెం: హామీలు నెరవేర్చని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు, నిలదీసేందుకు సిద్ధంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పిలుపునిచ్చారు. 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుటలోని సింధూర ఫంక్షన్ హాల్‌లో కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను స్క్రీన్‌పై చూపించి గుర్తు చేశారు. సాధ్యం కాని హామీలను నాడు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్‌లు ఇచ్చి.. నేడు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. చంద్రబాబు అంటేనే మోసం, వెన్నుపోట్లకు మారుపేరని, సొంత మామనే వెన్నుపోటు పొడిచారని, ఇక రాష్ట్ర ప్రజలను మోసం చేయడం తనకో లెక్కకాదని కె.కె.రాజు అన్నారు. తల్లికి వందనం, ఏడాదికి మూడు సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి ఇలా అనేక హామీలను ఇచ్చి మోసం చేసిన చంద్రబాబును ప్రశ్నించేందుకు, విషయాలను ప్రజలకు వివరించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి, గడప గడపకు సంక్షేమ పథకాలను చేరవేశామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాల అమలులో ఘోరంగా విఫలం

కంచరపాలెం: అమలు కాని హామీలిచ్చి, అందరినీ మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అన్నారు. 48వ వార్డు ఊర్వశి కూడలి ఫైర్ స్టేషన్ వద్ద కమ్యూనిటీ హాల్‌లో సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొగ్గు శ్రీను నేతృత్వంలో జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చేందుకు టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు ప్రజలకు ఎన్నో హామీలు గుప్పించారని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా తుంగలో తొక్కారని విమర్శించారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధిని చూసిన ప్రజలు.. ఇప్పుడవి అందక పోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు. అనంతరం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కరపత్రాన్ని కె.కె.రాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు నాయకులు నీలి రవి, కర్రి రామారెడ్డి, చిర్ల సత్యనారాయణ, రాజాన గంగరాజు, రవి, శంకరరావు, కె.శ్రీను, బి.భూలోక, ఆర్.రాంబాబు, డి.శ్రీను, పి.అప్పారావు, జె.జోసెఫ్, పి.అప్పారావు, జె.అప్పారావు, మోహన్, జి.శ్రీను, శివ అప్పారావు, ఉష, సురేష్, ఎర్ర శ్రీను, గ్రామ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

నూతన వాకర్స్ క్లబ్ ప్రారంభం



నూతన క్లబ్ వివరాలు ప్రకటిస్తున్న ప్రభావతి

మురళీనగర్: రైల్వే న్యూ కాలనీలో సోమవారం నూతన వాకర్స్ క్లబ్‌ను ప్రారంభించారు. త్రీస్టార్ వనితా వాకర్స్ క్లబ్ సౌజన్యంతో శ్రీసాయిరాం ఫైవ్ స్టార్ వాకర్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి క్లబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. సాయిరాం ఫైవ్ స్టార్ వాకర్స్ క్లబ్‌కు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. క్లబ్ అధ్యక్షురాలిగా విజయరమణి ప్రమాణ స్వీకారం చేశారు. ఎంజీఎఫ్ సభ్యురాలిగా ఆమె చేరారు. కార్యక్రమంలో జిల్లా–101 గవర్నర్ కె.ద్వారకానాథ్, రీజనల్ కౌన్సిలర్ ఉప్పలపాటి శుభ, ఎలెక్ట్ గవర్నర్ మహేష్, ఇంద్రా డోనార్ కమల్ బైద్, మహిళా సాధికారత సమన్వయకర్త లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా డిజిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్ కోర్సు శిక్షణకు ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి అనుశ్చిత్ జాతి అభ్యుదయ యోజన పథకం కింద మహారాణిపేటలోని నాక్ కేంద్రంలో ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. ఇంటర్ చదివి 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ కాలంలో మధ్యాహ్నం ఉచితంగా భోజన సదుపాయం కల్పిస్తామని, స్టేషనరీ అందజేస్తామని చెప్పారు. శిక్షణ అనంతరం ప్రభుత్వ సర్టిఫికెట్ జారీ చేసి, సంబంధిత రంగంలో ఉపాధి కల్పించనున్నారని, వివరాలకు 96761 70026, 798957 2891 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

అల్లిపురం: గంజాయి కలిగి ఉన్న ఒక వ్యక్తిని టూ టౌన్ క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. చావులమదుం దరి హేరిత లాడ్జిలో ఎస్ఐ సునీల్, కానిస్టేబుళ్లు గోవిందరావు, అజీజ్ సోమవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి నుంచి 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్ట్ చేశారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.